# వాయుపుత్రుడిగాలి ప్రయాణం

ఆంజనేయులికా రోజు సంతోషంతో వొళ్ళు పొంగిపోతోంది.

ఎవరో ఎదురుగా నిల్చుని "లేవయ్య. లేవయ్య– లేరయ్య నీసాటి" అని సంకీర్తన చేస్తున్నట్లే వెర్రి ఆనందంగా వుంది.

తనూ విమానంలో ప్రయాణించబోతున్నాడు. ఆకాశంలో విహరించబోతున్నాడు

అబ్బ! ఎన్ని సంవత్సరాల నాటి ముచ్చట తీరబోతోంది.

ఎప్పుడో చిన్నతనంలో మంచి చెడుకి, పాపానికి పుణ్యానికి, గొప్పకి బీదకి తేడాలు తెలీనప్పుడు సుష్టుగాతిని ఆరుబయట నులకమంచం పైన వెల్లకిలా తిరగబడ్డ బోదరకప్పలా పడుకుని ఆకాశం వైపు అమాయకంగా చూస్తున్నపుడు, శబ్దం చేసుకుంటూ, మినుకు మినుకు మంటున్న దీపాలతో ఎగురుతున్న విమానాన్ని చూసిన ఆ క్షణమే ఆంజనేయులుకి మొదటిసారి దాంట్లో ప్రయాణం చేయాలనిపించింది.

అసలు విమానంలో కూర్చుని ఆకాశంలోంచి క్రిందకి చూస్తుంటే ఆ అనుభూతి ఎలా వుంటుంది– ఏమనిపిస్తుంది? పెంకుటిళ్ళు, మేడలు, గుడిసెలు ఏవిధంగా కన్పిస్తాయి. మనుషులు, పశువులు ఒక్కలాగానే ఆగుపిస్తాయా? విమానం మేఘాల్లోంచి దూసుకుపోతుంటే ఆ పరిగెత్తుకుంటూ పోయే మబ్బులు కనిపిస్తాయా? ఇక్కడ్నించి ఆకాశం ఎలా కనిపిస్తోందో అంతదూరంగానే వుంటుందా లేక కిటికీలోంచి చెయ్యిచాపితే అందుకునే వీలుంటుందా?

ఇటువంటి సందేహాలన్నిటినీ తీర్చుకోవటానికి కనీసం ఒక్కసారైనా దాంట్లో ప్రయాణం చేయక తప్పదనుకున్నాడు అప్పుడే.

కాని వయసొచ్చి, కాస్తోకూస్తో బుద్ధి కూడా వచ్చాక అర్థమైంది– విమానాలెందుకున్నాయో. ఎవరి కోసం వున్నాయో. తనలాంటి అష్ఫాల్ గాడు గాల్లో ప్రయాణించాలనుకోవటం పంచాయతి సమితి ప్రెసిడెంట్ ప్రధాన మంత్రి కావాలని అనుకోవటం లాంటిదనికూడా అర్థమైంది. చేసేది గవర్నమెంటు గుమాస్తా. అంచేత అటువంటి ఆశలకి చుక్క పెట్టకపోతే వొళ్ళు విమానం మోతెక్కుతుందని గ్రహించి మర్చిపోవాలని ప్రయత్నం చేసేడు.

కాని జిహ్వ కోతిలాంటిది. ఆంజనేయుల్ది మరీను. ఏదో సందర్భంలో తోకజాడిస్తూ వుంటుంది. ఎంతకాదనుకున్నా అదేవిటో విమానశబ్దం వినగానే తల తన ప్రయత్నం లేకుండానే ఆకాశం వైపు తిరగటం. అది కనుమరుగయ్యేదాకా చూడటం– గతంలోని ఆలోచనలన్నీ పునరావృతం కావటం. పుండుపైన కారంజల్లినట్లు మనస్సు బాధపడటము. జీవితంలో ఒక భాగమై పోయింది.

కాని ఆశ గబుక్కున చావదు– అంతటి బాధలోంచి మళ్ళీ పుట్టుకొస్తుంది. ఏమో ఎవరు చూడొచ్చారు– ముందు ముందు కాలం ఎలా మారుతుందో ప్రభుత్వం వారు పరమ విశిష్టా గుమాస్తా అవార్డులిస్తే. అది తనకే రావచ్చు. దాన్నందుకోటానికి తాను విమానంలో ఢిల్లీ పోవచ్చును– లేకపోతే ఇపుడు సినిమావాళ్ళకి గిరాకి వచ్చినట్టు. రేపు ప్రభుత్వోద్యోగుల్లో క్లీన్ రిపోర్టున్న తనలాంటి సేవపరాయణులకి పిల్చి పార్టీ టిక్కెట్లివచ్చు. ఎంపీనో, ఎమ్మెల్సీనో అవచ్చు– అపుడెట్లాగో విమానమేగతి–

ఇలా ఆలోచిస్తూ ఆశని చంపెయ్యకుండా బతికించుకుంటూ వచ్చేడు ఆంజనేయులు ఎట్టకేలకు విమాన ప్రయాణయోగం పట్టబోతోంది.కాకపోతే అతడూ హించినట్లు అవార్డులందుకోటానికో. ప్రజాసేవ పేరుతోనో కాకుండా, "యల్టీసీ" అనే సదుపాయంద్వారా వెళ్ళబోతున్నాడు. నాలుదేళ్ళకోసారి దేశంలో ఏమూలకైనా వెళ్ళొచ్చే సదుపాయంద్వారా వెళ్ళబోతున్నాడు. నాలుగేళ్ళకోసారి దేశంలో ఏమూలకైనా వెళ్ళొచ్చే సదుపాయాన్ని ప్రభుత్వం వారు తమ వుద్యోగులకి కల్పించారని ఆంజనేయులికి తెల్సినా దాన్నుపయోగించుకుని విమానంలో కూడా వెళ్ళోచ్చని మొన్న సుబ్బరాజు ఫ్యామిలీతో సహా గాల్లో ఎగిరొచ్చి చెప్పేదాకా తెలీదు.

సరిగ్గా అప్పుడే ఆంజనేయులికి తన చిరకాల వాంఛని తీర్చుకునే దారీ కనిపించింది– కాని ఎన్నో సందేహాలు–

"అంటే విమానంలో వెడితే పూర్తి ఛార్జీలిస్తారా?" అనడిగాడు సుబ్బరాజుని ఒకరోజు.

సుబ్బరాజుకి తెల్సిన విషయాలు చాలా తక్కువ.

ఆ విషయం ఆఫీసులో అందరికీ తెల్సు. ఆ విషయం అందరికి తెలుసన్న సంగతి సుబ్బరాజుకు తెల్సు.

సబ్బరాజుకావిషయం తెల్సు. అంచేత ఆంజనేయులు అమాయకంగా సందేహం వెలిబుచ్చేసరికి సుబ్బరాజు మొహంలో సూర్యోదయం అయినట్టనిపించింది. తను సందేహ విప్రుత్తి చేయగలిగిన మరో జీవి ఈ ఆఫీసు గోడలమధ్యనే వుందని తెల్సుకుని పులకించిపోయి–

"అంతా ఇవ్వరోయ్ మిస్టరాంజనేయులు రైలు ఫస్టుక్లాసు చార్జీలే ఇస్తారు. డిఫరెన్సునూ మనం భరించాలి. ఆమాత్రం భరించకపోతే ఎలా విమానం ప్రయాణమంటే మజాకానా?

ఆమాట విన్నాక ఆంజనేయులుకాస్త జంకిన మాట వాస్తవం.

"రైలుకి, విమానానికి చార్జీల్లో ఎంత తేడా వుంటుందటారు? అనడిగాడు.

"గట్టిగానే వుంటుంది. అయినా ఛార్జీల్లో అంత తేడా ఎందకుంటుందో తెలుసా?" తెలీదన్నాడు ఆంజనేయులు అది విని సుబ్బరాజుకు మరింత పేట్రేగిపోయాడు. అతడిముందు ఆంజనేయులు పోలీసుకిచిక్కిన దొంగలాగాను. అపిచ్చినవాడికి అకౌకుండా తటస్థపడ్డ దాన్ని పుచ్చుకున్నవాడిలాగా నున్నాడ

ఇపుడు లాటరీలేతీసుకో లక్ష రూపాయలు ఫస్టు ఫస్టుప్రైయిజు రెండో మూడు లక్షలుందనుకో, టికెట్టు రేటుపెరుగుతుందాలేదా

"పెరుగుతుంది నిజమే. కానీ ఈ ప్రయాణాలకి ఆ లాటరీలకి ఏమిటి సావత్యం?" వెర్రి చూపుల్తో అడిగాడు ఆంజనేయులు.

సరిగ్గా సుబ్బరాజు ఆశించేది అదే అటువంటి అమాయకత్వమే కావాలి. అజ్ఞాని అమాయకుడు మూఢుడు అయిన సదరు ఆంజనేయులికి జ్ఞానోదయం చెయ్యటం తనతక్షణ కర్తవ్యంగాను, అటువంటి బృహత్తర కార్యక్రమాన్ని భుజాన వేసుకున్నట్టుగాను, చాలా సీరియస్సుగా–

ఇంత పూరేమోయ్ మిస్టరాంజనేయులూ నువు చాలా విషయాలు తెల్సు కోవాలి. ప్రయాణాలేవిటి? అసలు బతుకే పెద్ద లాటరీ ఇంతకీ మనం ఫేర్సు గురించి కదూ చెప్పుకుంటున్నాం."

'అవునన్నట్లు' భక్తిగా తలాడించేదు ఆంజనేయులు.

సుబ్బరాజు తాపీగా చెప్పనారంభించేడు.

"జాగ్రత్తగా వినవోయ్ మిస్టరాంజనేయులు. రైల్లో నువు ప్రయాణం చేస్తుంటావ్. ఆ రైలు యాక్సిడెంట్యింది. అతిసహజం. నువు బాల్చీ తన్నేశావు. అదికూడా సహజం. అపుడు ప్రభుత్వం నీఫ్యామిలీకి యాభై వేలు ముట్టచెపుతుంది. అదే విమానంలో ప్రయాణంచేస్తూ ప్రమాదంలో చచ్చారనుకో లక్షరూపాయలిస్తుంది. ఇపుడు చెప్పు లాటరీలకి, వాటి చార్జెస్‌లో తేడాలకి సావత్యం కన్నించిందా?

"కనిపించింది గురూగారూ, ఇంకో విషయం కూడా అర్థమైంది."

"ఏమిటది?"

"లాటరీ నిజంగా తగిలితే డబ్బులిస్తారో లేదో తెలీదు. ఎంచేతనంటే మనకెప్పుడూ తగల్లేదుగనక అలాగే ఈ ప్రయాణాల్లో చచ్చినవాడి ఫ్యామిలీకి ఆ డబ్బులిస్తారో లేదోకూడా తెలీదు. ఎంచేతనంటే మనమెప్పుడూ చావలేదు గనక."

ఆ మాటవిని సుబ్బరాజు బావుందదని నవ్వాడేగాని లోన కాస్త ఆశ్చర్యపడి ఇంకాస్త భయపడ్డాడు అతడి తెలివి తేటలకి.

"ఇంతకీ నువ్వు ఎయిర్ ట్రావెల్ చెయ్యాలనుకుంటున్నావా?"

అవునన్నాడు ఆంజనేయులు.

"చెప్పవేమోయ్ మరి. ఇలాంటివి దాచుకోకూడదు. కాపురంగుట్టు ప్రయాణాలు రట్టు అంటారు. పదిమందికి చెప్పి బస్సో, రైలో, విమానమో ఎక్కాలి.

కమింగ్ టు ది పాయింట్ విమానాల్లో ప్రయాణాలు చేసేవాళ్ళు బిగ్ షాట్స్-సినిమావాళ్ళు, బిజినెస్ వాళ్ళు, స్మగ్లర్స్, మంత్రులు అంచేత మనబోటిగాళ్ళు దాంట్లో ప్రయాణించాలనుకునేముందు కొన్ని విషయాలు తెల్సుకుని వాటిని జాగ్రత్తగా ఆచరించాలి. లేనిపక్షంలో అక్కడివాళ్ళంతా మనల్ని జోకరుగాణ్నో ఫూల్‌గాడ్నో చూసినట్టు చూస్తారు.

ఆంజనేయులికి ఆసక్తి భయము రెండూ కల్గినాయి ఆమాట విన్నాక.

"ఏవిటా విషయాలు?" అన్నాడు

"నెంబరు వన్- నీటుగా డ్రస్సు చేసుకోవాలి. ఈ ముతక బట్టల్తోను. మురికి మొహంతోను ఎక్కకూడదు. ఎక్కేవంటే ఎయిర్ హోస్టస్తో సహాపూర్ ఫెలోని కంట్రీబ్రూట్‌ని చూసినట్టు చూస్తారు. అంచేత భూమ్మీద ఎలా ఏడ్చినా. కనీసం గాల్లో వెళ్ళేటప్పుడు డ్రస్ చాలా మార్చి. ఫుల్‌సూట్లో వెడితే శ్రేష్టం ఇక నెంబర్ టూ-"

అంజనేయులు అత్యంతాసక్తిగా ఫాలో అవుతున్నాడని గుర్తించి, చెప్పుకుపోతున్నాడు.

"గాల్లో వున్న గంటసేపూ చిర్నవ్వుతో వుండాలి. మూతి బిగదీసుకూర్చోరాదు. ఎవరన్నా పలకరిస్తే "హల్లో" అనకూడదు. "హాయ్" అనాలి. ఆడంగులు పలకరిస్తే. "హాయ్ డార్లింగ్‌నో- హాయ్ హనీ" అనో అనాలి.

"అమ్మో దాన్తాలుకు వాళ్ళెవరన్నా వింటే అక్కడ్నించే గిరాటేస్తారు."

"మిస్టరాంజనేయులూ నువ్వుచాలా పూరోయ్ అలా అనకపోతే నువ్వు చెప్పిన ప్రమాదం సంభవించొచ్చు. అదే కల్చరంటే భూమికి, గాలికి చూసేవా మరి ఎంత తేడానో- ఇక నెంబర్ త్రీ-"

"ఇంకా వున్నాయా?"

"చాలా వున్నాయ్-కాని నీకు ముఖ్యమైనవి మాత్రమే చెపుతున్నా

"ఎయిర్‌హోస్టస్ పళ్ళెంలో బిస్కట్లు చాక్లెట్లు తీస్తే నవమి పందిళ్ళలో పానకానికెగబడ్డట్టు ఎగబడకూడదు. తినాలని జిహ్వా పీకిన చిర్నివ్వుతో "నోథాంక్స్‌హనీ" అని త్యాగం చెయ్యాలి. అంతేగాని వెర్రి మొహం వేసుకుని మైసూరు బజ్జీలు, రవ్వ దోసెలూ వుండవాని ఆరా తియ్యకూడదు.

ఆంజనేయులు ఆలోచనా రహితుడై చూస్తూ నిల్చుండి పోయేడు.

"ఇక నెంబర్‌ఫోర్ విమానం అగంగానే ఆర్టీసీ బస్సులోంచి దిగినట్టు జనంకాళ్ళు కసకస లాడిస్తూ కంగారుగా దిగరాదు. అక్కడ ఎంత చివర్న దిగితే అంత గొప్ప. మీరు ముందంటే మీరు ముందని పక్కవాడ్ని బయటకి నెట్టాలి."

ఆంజనేయులికి ఆశ్చర్యం వేసింది. తను ముచ్చటపడుతున్న ప్రయాణం వెనక ఇంత భాగోతం వుందానిపించింది. మిలట్రీలో వుండి సెలవుపైన వచ్చిన వాడిక క్రమశిక్షణంటే తెలీని బయట ప్రజల్ని, కనిపించిన వాడిని కనిపించినట్టు కాల్చేయ్యాలనిపిస్తుంది. అలాగే డబ్బున్న వాళ్లు విమాన ప్రయాణం పేరున గాల్లో ఇన్ని విన్యాసాలు చేస్తారు గనకనే భూమ్మీద వాళ్ళకి అసహనంగా అనిపిస్తుంది. అందుకే కాబోలు వాళ్ళు వుంటే గాల్లోను, లేకపోతే మందులోను వుంటారు పాపం:

ఆంజనేయులు ఆలోచన్లోంచి తెప్పరిల్లే సరికి జుబ్బరాజు శలవు పుచ్చుకుని తప్పుకున్నాడు. నిజానికతడు సుబ్బరాజుని ఇంకా చాలా విషయాలు అడగాలనుకున్నాడు. అందులో ముఖ్యమైంది మరుగుదొడ్డి సంగతి. విమానంలో మరుగుదొడ్డివుంటుందాని ఇటువంటి సెన్సిటివ్ విషయం అడిగితే అతడేం అనుకుంటాడోని కూడా కాస్త వెనక్కి లాగేడు. అడక్క ముందే సుబ్బరాజు వెళ్ళిపోయేడు. ఇహ దాన్ని గురించి ఆలోచించటం అనవసరమనుకున్నాడు. తనతో ప్రయాణం చేసే వాళ్లు మనుషులే గదా వాళ్ళకీ పట్టు విడుపులుంటాయ్ వాళ్ళెలా పట్టేరో తనూ అలాగే పడతాడు- వాళ్ళెలాగ విడుస్తారో తనూ అలాగే విడుస్తాడు-

రైట్-

ప్రతి ఆక్షణానే, అక్కడే ఆంజనేయులు విమానంలో తికెనతి వెళ్ళటానికి నిశ్చయించి చేసేడు. ఇంటికొచ్చి ఆ విషయం భార్య చెవిన కూడా వేసేసాడు.

ఆ వార్త విని కృష్ణవేణి రెండు రకాలుగా సంతోషంచింది. ఒకటి తన భర్త విమానంలో ప్రయాణం చెయ్యబోతున్నందుకు. రెండు. తనని తీసుగెడుతాడని ఆనందము. విమానంలో ప్రయాణమంటే ఆంజనేయులికెంతమోజో. కృష్ణవేణికంత భయం.

"ఎల్లుండే ప్రయాణం. వెళ్ళి మీ అన్నయ్య నడిగి పెళ్ళి నాటి సూటు, బ్రీఫ్‌కేసు పట్రా అన్నారు. భార్యతో.

"అవెందుకండీ!"

"మాట్టాడక– విమానం అంటే పూరీ పాసింజరు బండి అనుకున్నావా?.ఎంత స్టేటుస్సు–ఎంత గొడవ అన్నాడు విసుగ్గా.

క్రిష్ణవేణి వెళ్ళి అన్నగారి సూటూ, టై, బ్రీఫ్‌కేసూ తెచ్చింది. ఆంజేనేయులు సూటుని పదిహేను రూపాయలిచ్చి డ్రయి క్లీనింగ్ కూడా చేయించాడు.

తీరా ప్రయాణం రోజున ప్యాంటుని వేఉకోబోతే గోన సంచిలో నిట్చున్నట్టుగా వుందిగాని ప్యాంటు తొడుక్కున్నట్టు లేదు. ఆంజనేయులి బావ మరిది వుదరకాయుడు. చవితి పండక్కి అంగవస్త్రం కట్టి. కుడుంచేతికిచ్చి కూర్చోబెడితే, ఇక విగ్రహంలోపముండదు. కాని ఆంజనేయులికి అంతటి పొట్టలేనందున, ప్యాంటు, తండ్రి పూళ్ళోలేదని తెల్సి పెట్రేగిపోయిన పిల్లవాడిలా. నడుం దగ్గర ఆగకబుడుంగున జారి కాళ్ళపైకి పడిపోతోంది. కాస్సేపు దాంతో పెనుగులాడి చివరికి తోలు బెల్టుతో బలవంతాన బిగించారు. ముసల్దాని ముడతలు పడ్డ మూతిలా ప్యాంటు నడుంని పట్టుకుని నిలబడింది కోటు గూడా వేసేడు, కాస్త పొట్టిగి అన్పించినా సర్లెమ్మని హుందాగా జేబుల్లోకి చేతులు పోనిచ్చాడు. గుండె జల్లుమంది.

రెండు జేబులూ పూర్తిగా చిల్లులు పడ్డాయ్. చేతులు తారాజువ్వల్లాగా బయటికి దూసుకొచ్చినాయ్.

"వేణీ! వీడిల్లు బంగారంగాను ఈ కోటుకి జేబుల్లేవ్" అన్నాడు దిగులుగా "అన్నట్టు అన్నయ్యచెప్పాడండీ, మొన్న దీపావళికి స్వీట్సు తెచ్చి పిల్లలకిస్తే వాళ్ళు ఆ జేబుల్లో దాచుకున్నారట తెల్లవారేసరికి ఎలికలు ఆ స్వీట్సుని జేబుతో సహా తినేసాయిట."

"వెధవ పిల్లలు, వెధవసీట్సు, వెధవ ఎలికలు అసలు వెధవ పండగలు ఆన్చెప్పి కాసేపు వెధవ సంకీర్తనం చేసి, టైంలేదని ఆ కోటూ, ఆపాంటూ ఆ బ్రీఫ్‌తో బయల్దేరాడు.

"ఏవండోయ్! చేతులు మెర్రీసీనుగా లోపలికెళ్ళి తలపేసుకో" అన్పెప్పి రోడ్డెక్కి అలవాటు కొద్దీ బస్సుస్టాండు వైపు వెళ్ళిపోయి పద్ధతి కాదని, టాక్సీ పిల్చి ఎక్కికూర్చుని "ఎయిర్‌పోర్ట్" అన్నాడు.

..

ఎయిర్‌పోర్టు, లాంజ్ సందడిగా వుంది. పెద్దహాలు, అన్ని వైపులా మెత్తని సోఫాలు, వాటిల్లో ఖరీదైన మనుషులు, విదేశీ, స్వదేశీ వరసిన విచిత్ర సందడి.

ఆంజనేయులు బ్రీఫ్‌కేసు పుచ్చుకుని ఒక స్తంభంవారగా నిల్చున్నాడు. కాలం గడుస్తున్న కొద్దీ ప్యాంటు మార్చుకొస్తే బావుండేదేమోనన్న అభిప్రాయం బలంగా పుంజుకోసాగింది. ప్రాణం హాయిగా, స్థిమితంగా వున్నట్టనిపించలేదు. అలాగే నిల్చుని జనాన్ని వింతగా చూస్తున్నాడు.

అంతలో ఎనౌన్సుమెంటు వినిపించింది. "ది ఫ్లయిట్ నెం..... హైద్రాబాద్ టూ తిరుపతి... పాసింజెర్స్ ఆర్రి క్వస్టూడ్... కూర్చున్న జనంలోంచి సగం మంది గుడిసెలంటుకున్నట్టు గుంపులు గుంపులుగా ద్వారం వైపు వెళ్ళారు. ఆంజనేయులికి చటుక్కున సుబ్బరాజు చెప్పిన "ఆలస్యం అంతస్థుని చెబుతుందన్న సంగతి గుర్తుకొచ్చి అక్కడే నిల్చుని, జరుగుతున్న తంతుని చూడసాగాడు. అందరూ గేటు వద్ద నిల్చున్న తెల్లబట్టల కుర్రాడికి వెడ్డింగు కార్డులాటి టిక్కెట్టు చూపించి లోపలికెడుతున్నారు.

ఆంజనేయుడికి అప్పుడు గాని గుర్తుకురాలేదు. తన టిక్కెట్టు బ్రీఫ్‌కేసులో వున్నట్లు. దాని తాళంచెవి మొలత్రాడుకి బంధించిన సంగతి. కోటుకేమో జేబుల్లేవు. తాళంచెవిని ప్యాంటు జేబులో వేద్దామంటే. ముడతల మధ్యన జేబుని పట్టుకోవటమే కష్టంగా తోచింది. ఆంజనేయులు అక్కడ్నించి కదిలి చకా చకా "టాయిలెట్" అని వ్రాస్తున్న గదివైపుగా వెళ్ళాడు.

ఆశ్చర్యంగా, విచిత్రంగా ఆ గదిలో సందడే లేదు. "థాంక్ గాడ్ ఆఫ్ సెవెక హిల్స్" అనుకుని బ్రీఫ్‌ని వాష్‌బేసిను పైనుంచాడు ఆపైన కోటుని ప్రక్కకి తప్పించి ప్యాంటుకున్న బెల్టుని వదుల్చేసి, చెయ్యిని లోనికి పోనిచ్చి మొలత్రాడు కోసం

గాలిస్తున్నాడ్డు. అదే అదనుగా అరువు ప్యాంటు సర్రున జారిచించుకున్న కడుపులా కాళ్ళపైన పడింది.

ప్యాంటుని పైకి లాగాలా. లేక మొలత్రాడుని బయటకి తియ్యాలాని కాస్సేపాలోచించి, రెండోపనే ముందు చెయ్యాలని తీర్మానించి, ఎట్టకేలకు మొలత్రాడుని, దానికి బంధించిన తాళపు చెవిని పట్టి ప్యాంటు కాళ్ళకి బంధంగా వుండటం చేత రెండంగలు ముందుకి దూకి, వాష్ బేసినుపై నున్న బ్రీఫ్‌కేసు పైకి వొంగి దాన్ని తెరిచే ప్రయత్నంలో వుండగా–

–అంతట్లోనే ఆంజనేయులి కొంపముంచటానికున్నట్లు మరో ఆసామి తలుపు తీసుకుని లోనికొచ్చాదు, అతను ఫుల్ సూట్లో వున్నాడు చేతిలో చిన్న లెదర్ బ్యాగ్–

వచ్చీ రాగానే ఆంజనేయులి పరిస్థితి చూసి అవాక్కయి పోయేడు. జారిపోయిన ప్యాంటు– పైకి లేపిన కోటు కన్పిస్తున్న గళ్ళ నిక్కరు, చేతిలో ఎర్రటి మొలత్రాడు– వాష్‌బేసినుపై పూర్తిగా వాలిపోయి తెరవాలని చూస్తున్న బీఫ్–అన్నిటికి మించి ఆంజనేయులి ఆదుర్దా– హడావిడి రెండు క్షణాల్లో తేరుకుని "వాటీజ్ దట్ యూ ఆర్ దూయింగ్" అనడిగాదు.

ఆంజనేయులికి దొంగవెధవ అనుకుంటాడేమోనని భయం వేసి "ది సీజ్ మై బ్రీఫ్ వోన్లీ– బల్ కీ ఇన్ మొల్తాడ్–"

"వాట్ మొల్తాడ్" అన్నాడా వ్యక్తి అయోమయంగా. ఆంజనేయులికి ఆక్షణంతో మొలత్రాడుని ఇంగ్లీషులో ఏవంటారో స్ఫురించలేదు. ఆంజనేయులు వెర్రిగా అతడి వంక చూస్తుండగా ఆ వ్యక్తి చిన్నగా నవ్వి "మీరు తెలుగు వారేనా" అన్నాదు.

ఆంజనేయులికామాటతో ప్రాణం లేచొచ్చి విషయమంతా దాచకుండా చెప్పేసాదు.

కొద్ది క్షణాల పిదప ఆంజనేయులు అస్తవ్యస్తంగా ప్యాంటుని నడుంపై నిలబెట్టి, బ్రీఫ్‌ని చంకలో పెట్టుకుని టిక్కెట్టుని చేత్తో పుచ్చుకుని ఆ గదిలోంచి బయటపడ్డాదు.

లోపలుండి పోయిన షూటు వాలా ఆంజనేయులు వెళ్ళిపోయేక సంచీని వాష్ బేసిను వైపుంచి ప్యాంటు వొదులు చేసి మొలత్రాడుకై... ఇంకో ఆంజనేయులు!ః

మన కథానాయుకుడైన ఆంజనేయులు ఆదరా బాదరాగా, చెమటలు కారుతూ గాజు తలుపుల వద్దకొచ్చి చేతిలో వున్న టిక్కెట్టుని అక్కడున్న తెల్లబట్టల కుర్రాడికి చూపించాదు. అదిచూసి అతడు "ఓ మైగాడ్– తిరుపతీ ఫ్లైయిట్? జస్ట్ వే లెఫ్ట– సీ" అంటూ దూరంగా కన్పిస్తున్న పక్షిలాంటి విమానాన్ని ఆకాశంలోకి చెయ్యిపెట్టి చూపించాదు.

ఆంజనేయులు అలాగే రెండు క్షణాలు కదలకుండా నిలబడి. దూరంగా మబ్బుల చాటుకి మాయమవుతున్న విమానాన్ని చూసేడు. ఆ క్షణంలో అతడికది విమానంలా కాకుండా తనలోంచి బయటపడి పారిపోతున్న తన అర్థం లేని కోరిక లాగానూ, తనని తాను మోసం చేసుకోవాలని చూసిన భ్రమ లాగాను అన్పించింది.

అలా అన్పించగానే పెద్దగా నవ్వేడు. చేతిలో వున్న టిక్కెట్టునని ముక్కలు ముక్కలుగా చింపి గాల్లోకి ఎగరేసాదు.

తెల్లబట్టల వారు తెల్లబోయేడు– ఇంకా కొంత మంది గూడా అతడి వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఆంజనేయులు పట్టించుకోక జారి పోతున్న ప్యాంటుని పైకిలాక్కుంటూ కదిలాడు–

ఈ విమానాల కన్నా రైళ్లే నయం గంటల తరబడి పడుంటాయి. తన లాంటి సంసారపక్షం వాడికనే ఆరాధ్యదైవాలు. ఎందుకొచ్చిన విమాన ప్రయాణాలు– అనుకుంటూ లాంజ్ దాటి బైటికెళ్ళి పోయాదు. ఆరోగ్యకరమైన ప్రపంచంలోకి జనం మధ్యకీను.